
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఆకట్టుకోని జగన్ ప్రసంగం

సీఎం జగన్ ప్రసంగంలో నరసాపురం రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన రూ.3,200 కోట్ల పనుల ప్రస్తావన లేదు. మేనిఫెస్టో ఊసేలేదు. తీర ప్రాంతం అభివృద్ధిపై ఎలాంటి హామీ ఇవ్వలేదు. ప్రసంగించిన సమయంలో పావు గంటపాటు చంద్రబాబును తిట్టడానికే సరిపోయింది. మళ్లీ తాను అధికారంలోకి వస్తే పథకాలు ఉంటాయని, టీడీపీకి ఓటేస్తే అవన్నీ ఆగిపోతాయని భయపెట్టే ప్రయత్నం చేశారు. ఎన్నికల ప్రచారం మొదలు పెట్టినప్పటి నుంచి ఎక్కడ చెప్పినా ఇదే ఊకదంపుడు ప్రసంగం అంటూ జనం విసిగిపోయారు. అంతా పాత పాటే కావడంతో ఆకట్టుకోలేదు. మరోవైపు ఎండ వేడిమికి తట్టుకోలేక సీఎం మాట్లాడుతుండగానే జనం తిరుగుముఖం పట్టడంతో ఓ 20 నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించేశారు.



నరసాపురంలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం

సీఎం సభ తుస్

మాట్లాడుతుండగానే జనం తిరుగుముఖం

- హామీలు లేవ్.. పాత ప్రాజెక్టు పనుల ఊసేలేదు.. చప్పగా సాగిన జగన్ ప్రసంగం
- మండే ఎండలో జనానికి నరకం
- తాగేందుకు నీళ్లు లేక విలవిల
- అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు
- దుకాణాల బంద్.. వాహనదారుల ఇక్కట్లు

నరసాపురం/నరసాపురం టౌన్, మే 3: సీఎం వైఎస్ జగన్ నరసాపురం పర్యటన తీరప్రాంతవాసులను తీవ్ర నిరుత్సాహపర్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నరసాపురం చేరుకుని 12 గంటలకు తిరిగి వెళ్లాలి. అనుకున్న సమయానికి వస్తారని భావించిన పార్టీ నాయకత్వం ఉదయం ఎనిమిది గంటల నుంచే జనాన్ని సమీకరించారు. వేదికను స్టీమర్ రోడ్‌లో ఏర్పాటు చేశారు. అక్కడ కూర్చునేందుకు సరైన వసతులు లేవు. మార్కెట్‌లో దుకాణాలన్ని మూయించి వేయడంతో షాపుల అరుగుల వద్ద ఎండ వేడికి తలదాచుకు న్నారు. తాగేందుకు నీళ్లు కూడా అందించలేకపోయారు. ఈ కారణంగా మహిళలు నానా ఇబ్బందులు పడ్డారు. అత్యవసరాలకు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆశ్రయించారు. సీఎం సభ 12 గంటలకు ప్రారంభం కావడంతో నలుదిక్కుల తలదాచుకున్న జనం వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికే నీరసించిన ప్రజలు సీఎం ప్రసంగం మొదలుపెట్టగానే ఎండ వేడిమికి తట్టుకోలేకపోయారు. నీడ కూడా లేకపోవడంతో ఎండలో నిలబడలేకపోయారు. దీంతో మహిళలు వెనుదిరగడం మొదలుపెట్టారు. అదే బాటలో వచ్చిన జనం మెల్లగా జారుకోవడం ప్రారంభించారు. దీనిని గమనించిన పార్టీ నేతలు సభా ప్రాంగణం చివరిలో ఉండి వీరిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఎండకు తట్టుకోలే వెళ్లిపోతామంటూ జారుకున్నారు. జనం వెళ్లిపోవడం గమనించిన సీఎం కూడా తన ప్రసంగాన్ని త్వరగా ముగించారు.

అడుగడుగునా ఆంక్షలు

సీఎం పర్యటనతో ఉదయం నుంచి పట్టణంలో అడుగడుగునా ఆంక్షలు పెట్టారు. హెలీక్యాప్టర్‌లో వచ్చిన సీఎం టైలర్ హైస్కూల్ మైదానంలో దిగి, అక్కడి నుంచి స్టీమర్ రోడ్‌కు చేరుకున్నారు. మెయిన్‌రోడ్‌కు వచ్చే రహదార్లపై ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు, వీధి చివర్లో బారికేట్లు కట్టారు. ఈ కారణంగా మార్కెట్, ఆస్పత్రులకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వచ్చిన జనం కూడా చాలా మంది బైక్‌లపై వచ్చి వాటిని పట్టణంలో ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేశారు. దీంతో రోడ్లన్ని వాహనాలతో నిండిపోయి అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడింది. మొగల్తూరు వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

కనిపించని ముఖ్య నేతలు

సీఎం పర్యటనలో జిల్లాకు చెందిన ముఖ్య నేతలెవరూ కనిపించలేదు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, నరసాపురం, పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థులు ముదునూరి ప్రసాదరాజు, గుడాల గోపి మాత్రమే కనిపించారు. జిల్లాలో పోటీ చేస్తున్న ఇతర అభ్యర్థులు ఎవరూ సీఎంను కలిసేందుకు రాలేదు. అడుగడుగునా పోలీసు బందోబస్తు కనిపించింది. హెలిప్యాడ్ వద్ద అన్ని రహదారుల కూడళ్లలోను, సీఎం సభ జరుగుతుండగా అన్ని షాపులపైన, మాధవాయిపాలెం రేవుల్లోను పోలీసులు ఎక్కువగా కనిపించారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉండటంతో సభావేదిక వద్దకు వచ్చిన జనం తిరిగి బయటకు వచ్చేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.

పాత పనులపై స్పష్టత లేదు

సీఎం గతంలో రూ.3,200 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో వశిష్ట వారధి, హార్బర్, ఆక్వా యూనివర్సిటీ, వాటర్‌గ్రిడ్, రెగ్యులేటర్, సబ్‌స్టేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులు ఉన్నాయి. వీటిలో ఆక్వా యూనివర్సిటీ మినహా ఏ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. వీటిపై సీఎం మాట్లాడతారని ప్రజలు ఆశతో ఎదురు చూశారు. కనీసం వాటి ప్రస్తావనే రాలేదు. పెండింగ్‌లో సమస్యలపై నోరు విప్పలేదు. దీంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు.

కైకలూరు కూటమిదే

ఈ ప్రాంత అభివృద్ధికి నాదే హామీ : జనసేనాని పవన్‌కల్యాణ్ భరోసా

- కొల్లేరు కాంటూరు కుదింపునకే ప్రాధాన్యత
- ఆక్వాకు పూర్వ వైభవం..
- ఎమ్మెల్యే దూలంకు భయపడనక్కర్లేదు
- పర్యాటక శాఖ మంత్రి ఒక్కసారైనా వచ్చారా..



సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, చిత్రంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్, అంబటి రాయుడు తదితరులు



పవన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఏలూరు/ కైకలూరు/నిడమర్రు, మే 3(ఆంధ్రజ్యోతి): 'ఈ దూలంకు ఎవరూ భయపడనక్కర్లేదు. ఎమ్మెల్యేగా కైకలూరును నిలువెత్తు దోచేశాడు. ఎమ్మెల్యేకు, ఆయన కొడుక్కి ఎందుకింత భయపడుతున్నారు. కొల్లేరు స్థానికులను భయపెట్టి 50 ఎకరాలు దోచేసుకొన్నాడని ఇక్కడి వారు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఏమైనా దిగొచ్చాడా.. ఆయనకు ఎందుకు భయపడాలి మనం.. కైకలూరు వారి సొంతమా.. ఈ నేల వారి సొంతమా.. ఆంధ్రప్రదేశ్ జగన్ సొంతమా ఎందుకు భయపడాలి వాళ్లకి.. తన కుటుంబంతో నియోజకవర్గాన్ని దోచేసిన దూలంను ఎన్నికల్లో తరిమికొట్టండి' అంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. కైకలూరులో శుక్రవారం కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. 'ప్రతి సగటు మనిషి నాతో సహా ఆరోగ్యం, తాగు, సాగు నీరు, బిడ్డల చదువు, ఉండడానికి గూడు కోరుకుంటారు. ఇవి ఇవ్వడానికే ప్రభుత్వాన్ని ఎన్నుకొంటారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని ప్రజలకు అందివ్వలేదు. మన కార్మికులు ఎంతో కష్టపడి ఎన్నో భవంతులు కడతారు. ఆ భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టాడు ఈ జగన్. ప్రతి కట్టడానికి ఒక శాతం సెస్ కడతాం మనం. వారి సంక్షేమం కోసం వసూలు చేసే సెస్ సొమ్ము రూ.450 కోట్లు దోచేశాడు. కూటమి ప్రభుత్వం రాగానే వారి సంక్షేమం కోసం కృషి చేస్తాం. అలాగే అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తాం. ప్రతి కుటుంబానికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. రైతులకు రూ.20 వేలు అందిస్తాం. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉత్తమమైన మార్గం చర్చించి నిర్ణయం తీసుకొంటాం. ప్రతి ఉద్యోగి రిటైర్‌మెంట్‌రోజున సంతోషంగా ఇంటికి వెళ్లాలే గానీ బాధపడుతూ వెళ్లకూడదు. వారికి రావాల్సిన టీఏ, డీఏ, ఎర్న్ లీవులు సకాలంలో ఒకటో తేదీన జీతాలు ఇస్తాం. ఆక్వా రంగానికి అన్యాయం చేశారు. దీనివల్ల వాటర్ పొల్యూషన్ అయితే రూ.150 కోట్లు పెట్టి ప్రాజెక్టు చేపడితే ఆ సమస్య పరిష్కారమవుతుంది. మత్స్యకారులకు వలలు ఇవ్వలేదు. ఇది మానివేసి జగన్ వైసీపీ రంగుల కోసం రూ.1300 కోట్లు, సాక్షి పేపరు కొనడానికి రూ.200 కోట్లు, ప్రకటనలకు రూ. 400 కోట్లు ఖర్చు పెడుతున్నాడు. కొల్లేరు కాంటూరు సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కేంద్రంతో చర్చించగల సమర్థుడు కామినేని. ఆయనను ఎన్నుకోవాలి. కామినేని ఆరోగ్య మంత్రిగా ఉద్దానం సమస్యను పరిష్కరించారు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఒక్కసారైనా ఆ శాఖ మంత్రి వచ్చారా.. ఇదీ వారి పాలన. ఈ జగన్ పచ్చి అబద్ధాలకోరు. ఎమ్మెల్యేకైనా, జగన్‌కైనా ఇదే చెబుతున్నా.. మీ అవినీతి కోటలు బద్దలు కొడతాం. జగన్ హయాంలో 7,300 కాలేజీలు మూసివేశారు. 30 వేల మంది ఆడబిడ్డలు రాష్ట్రంలో అదృశ్యమయ్యారు. 25 వేల కిలోల గంజాయి వైజాగ్ పోర్టులో దిగుమతి అయ్యింది. మన యువతను మత్తులో పెడుతున్నాడు. మీలో ధైర్యం నింపడానికే వచ్చా.. భయంతో బతకొద్దు. ధైర్యంగా ముందుకు సాగండి.

ఓట్లు చీల్చడానికే స్వతంత్రులకు గ్లాసు గుర్తు

కూటమి ఒప్పందాల్లో భాగంగా కైకలూరును బీజేపీకి కేటాయించాం. జగన్ కుట్రతో కూటమిలో జనసేన పోటీ చేయనిచోట ఓట్లు చీల్చడానికి స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసును కేటాయించారు. ఈ కుట్రను గమనించి కైకలూరులో కమలం గుర్తుకు ఓటేయాలి.

పుట్టాకు పవన్ ప్రశంసలు

ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ ఎంతో ఉన్నతమైన వ్యక్తి అని జనసేనాని పవన్‌కల్యాణ్ కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పోలవరం నిర్వాసితుల కోసం 33 వేల కోట్ల నిధులు కావాలని, తన వంతు సాయంగా కోటి రూపాయలు విరాళంగా ప్రకటించగా, అదే సభలో మహేష్ తాను రూ.కోటి విరాళమందిస్తానని ప్రకటించాడని పవన్ కొనియాడారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తాం

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తాం. కలిదిండిలో అగ్నిమాపక కేంద్రం, ముదినేపల్లిలో ధాన్యం గొడౌను, డిగ్రీ కళాశాల, కైకలూరులో ఈఎస్ఐ ఆస్పత్రి, పార్కు, పీహెచ్‌సీ, డయాలిసిస్ యూనిట్, కలిసిపూడి రెగ్యులేటర్, కలిదిండిలో రైతు బజారు తదితర వాటిని ఏర్పాటుచేస్తాం. ఇందుకు నాదీ బాధ్యత. ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపైన, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిలు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలి' అని పవన్ పిలుపునిచ్చారు. జనసేన నాయకుడు, క్రికెటర్ అంబటి రాయుడు మాట్లాడుతూ వైసీపీకి అధికార దాహం ఎక్కువని, పవన్ కల్యాణ్‌పై నమ్మకంతో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

అవినీతి పాలనతో విసిగిపోయారు : కామినేని

డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ 'వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలతో కైకలూరు ప్రజలు విసిగిపోయారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించే విధంగా చేయ డమే లక్ష్యం. ఆక్వా పరిశ్రమతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. కొల్లేరుకు శాశ్వత పరిష్కారంతోనే ఈ ప్రాంత ప్రజలు జీవనోపాధి పెరుగుతుంది. మంచి సమాజం కోసం కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలి' అని కోరారు.


ఉద్యోగ, ఉపాధి కల్పనే కూటమి లక్ష్యం : పుట్టా

పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, పరిశ్రమల స్థాపన జరగాలన్నా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలి. రైతులకు గిట్టుబాటు ధరలు, మహిళల ఆర్థికాభ్యున్నతి, సామాజిక వర్గాల వారీగా కల్యాణ మండపాల ఏర్పాటు, కొల్లేరు తదితర సమస్యలను పార్లమెంట్‌లో గళమెత్తుతా. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తాం' అంటూ స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బలే ఏసురాజు, పెన్మెత్స త్రినాథరాజు వీరమల్లు నరసింహారావు, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, కొల్లి వరప్రసాద్, చలపతి, భట్టు లీలాకనకదుర్గ, తోట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన మూడు పార్టీల శ్రేణులు

నేడు నూజివీడులో చంద్రబాబు ప్రజాగళం



నూజివీడు, మే 3 : ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నూజివీడులో పర్యటించనున్నారు. నూజివీడు రోటరీక్లబ్ సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం 3.45 నిమిషాలకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడి నుంచి రాజీవ్ సర్కిల్ వెంకటేశ్వరస్వామి కోవెల, పెద్దగాంధీ బొమ్మ సెంటర్, ద్వారకా సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా పండ్ల మార్కెట్ వద్దకు రోడ్ షోగా చేరుకుని అక్కడ ప్రజల నుద్దేశించి కొద్దిసేపు ప్రసంగిస్తారు. అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడినుంచి కాకినాడకు వెళతారు. కాగా చంద్రబాబు నాయుడి ప్రజాగళం కార్యక్రమాన్ని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.



తిమ్మిరెడ్డిపల్లిలో రచ్చబండలా ప్రచారాన్ని నిర్వహిస్తున్న రోషన్‌కుమార్

రచ్చబండ తరహాలో రోషన్ ప్రచారం

చింతలపూడి, మే 3: చింతలపూడి కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ప్రచార శైలిలో నూతన పంథా ఎన్నుకున్నారు. చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లిలో రచ్చబండ తరహాలో ఇటు పార్టీ కార్యకర్తలతో, అటు ప్రజలతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం పనితీరు ఎలా ఉందంటూ అడిగి తెలుసుకుని వైసీపీ వైఫల్యాల పైనా వివరించారు. వైసీపీ పాలనలో రూ.14 లక్షల కోట్లు అప్పు మిగిలిందని, దీనివల్ల సామాన్యుల పై భారం పడుతోందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల వారికి అభ్యున్నతికి కృషి చేయనున్నట్టు వివరించారు. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయిస్తానని రాష్ట్రంలో రాజధాని, పోలవరం ప్రాజెక్టు ఇవన్నీ కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతాయన్నారు. తాను స్థానికుడినేనని, తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ కూటమి అభ్యర్థుల సైకిల్ గుర్తుకు వేసి గెలిపించాలన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ప్రజలకు సేవ చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని, కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సతీమణి సొంగా విజయ శుక్రవారం రాత్రి జార్జ్‌పేటలో ఇంటింటా ప్రచారం చేశారు.

ఇంటి వద్దకే ఓటు.. తొలిరోజు 579 మంది వినియోగం

ఏలూరు సిటీ, మే 3 : దేశంలోనే తొలిసారిగా ఎన్నికల సంఘం వృద్ధులు, నడవలేని వికలాంగులకు తమ ఇళ్ల వద్దే ఓటు వేసే అవకాశాన్ని కల్పించడంతో ఏలూరు జిల్లాలో తొలిరోజు హోం ఓటింగ్ విజయవంతంగా ప్రారంభమైనట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 85 ఏళ్ల పైబడిన వారు, 40 శాతంకన్నా ఎక్కువ వికలాంగత్వం వున్న వారికి ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. జిల్లాలో 914 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో తొలి రోజు శుక్రవారం 579 మంది తమ ఇళ్ల వద్దే ఓట్లు వేశారు. పోలవరం నియోజకవర్గంలో 90 మంది, ఉంగుటూరు-113, ఏలూరు-54, చింతలపూడి-63, దెందులూరు-87, కైకలూరు-113, నూజివీడులో 59 మంది ఉన్నారు. పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, వీడియో గ్రాఫర్, ఆర్మ్ కానిస్టేబుల్ సమక్షంలో వీటిని నిర్వహించారు. ప్రత్యేక పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటును వేయించి సీల్డ్ కవర్‌లో అధికారుల సమక్షంలోనే స్టీల్ డ్రమ్ములో భద్రపరుస్తున్నాం. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. శనివారం కూడా ఇది కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో 1,119 మందికిగాను, తొలిరోజు 213 మంది వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆచంట లో 86 మంది, పాలకొల్లు 329, నరసాపురం 112, భీమవరం 109, ఉండి 151, తణుకు 181, తాడేపల్లిగూడెంలో 151 మంది ఉన్నారు. మొదటి విడతగా మూడో తేదీ నుంచి ఐదు వరకు, రెండో విడత ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.



కొత్తూరులోని తన ఇంటిలో ఓటు వేస్తున్న వృద్ధురాలు కాపుదాసి తిరుపతమ్మ, భీమవరంలో ఓటు వేసి చూపిస్తున్న వృద్ధురాలు

13న ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 3 : జిల్లాలో మే 13వ తేదీన ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులు చేస్తున్న ఏర్పాట్లను న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్‌వ్యాస్ శుక్రవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీలు, ఎన్నికల సాధారణ వ్యయ పరిశీలకులతో సమీక్షించారు. ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు , ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి , ఎన్నికల సాధారణ పరిశీలకులు డా.కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌పి రామన్, జిల్లా పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు టి.జోర్దాన్ భూటియా, పి.కీర్తినారాయణ్, మేశ్రమ్ గౌరవ్ మధుకర్, డీఆర్వో పుష్పమణి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా జిల్లాలో ఏర్పాటు చేసిన 1,744 పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్సా కేంద్రంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

15 లోగా ఇంటర్ అడ్మిషన్లు పూర్తి : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, మే 3 : జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లోని జడ్పీ హైస్కూళ్లలో కో-ఎడ్యుకేషన్ విధానంలో ఈ ఏడాది నుంచి ప్రారంభించనున్న జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను ఈ నెల 15వ తేదీ లోగా పూర్తిచేసేందుకు బోధనా సిబ్బంది, హెచ్‌ఎంలు క్షేత్రస్థాయిలో నూరుశాతం కృషి చేయాలని డీఈవో అబ్రహం ఆదేశించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను బోధిస్తున్న 21 జడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, కొత్తగా ప్రారంభించనున్న 9 కో-ఎడ్యుకేషన్ కళాశాలల ప్రధానోపాధ్యా యులతో శుక్రవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. ప్రతీ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల నుంచి కనీసం రెండుగ్రూపులు ఉండాల్సిందేనని, ఒక్కో గ్రూపులో కనీసం 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోకపోతే నిబంధనల ప్రకారం సంబంధిత సబ్జెక్టును బోధించే పీజీటీ పోస్టును తొలగించే అవకాశం ఉందని హెచ్చరించారు. దీనికి అనుగుణంగా అడ్మిషన్లు ఉండేలా బోధనా సిబ్బంది టెన్త్ పాసైన బాలబాలికల తల్లిదండ్రులను కలుసుకుని ఇంటర్‌లో విద్యార్థులను చేర్పుకునేలా శ్రమించాలన్నారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు రానున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధపడేలా వారికి సమ్మర్ కోచింగ్ క్లాసులు రెండు పూటలా నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయాన్ని గుర్తుచేస్తూ ఈ ప్రత్యేక తరగతులు జరుగుతున్నదీ, లేనిదీ తాను ఆకస్మిక తనిఖీల ద్వారా పరిశీలిస్తానని, ఎక్కడైనా క్లాసులు జరగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెబెక్స్ సమావేశంలో కొన్ని మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

10 నుంచి కాల్వల కట్టివేత

ఏలూరు సిటీ, మే 3 : గోదావరి తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వల పరిధిలో గల వరి పంట , తాగునీటి అవసరాలు చివరి స్థాయికి చేరినందున పంట కాల్వలకు నీటి విడుదల ఈనెల 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు నిలుపుదల చేయనున్నట్టు ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం ఛీఫ్ ఇంజనీర్ సతీష్ కుమార్ తెలిపారు. గోదావరి డెల్టా సిస్టం పరిధిలో గల పంట కాల్వలకు రబీ (2023-24) పంటకు గాను నీటి సరఫరా నిరంతరాయంగా జరుగుతున్నట్టు వివరించారు.

నేడు 11 మండలాల్లో వడగాడ్పులు



ఏలూరు సిటీ, మే 3 : జిల్లాలో కొన్ని రోజులుగా భారీగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 46 డిగ్రీల సెంటీగ్రేడ్ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వేడిగాలులు, వడగాడ్పుల తీవ్రత విపరీతంగా పెరిగింది. జిల్లాలో ఈనెల 4వ తేదీన 11 మండలాల్లో తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం ఉంద ని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక మండలంలో, ఏలూరు జిల్లాలోని 11 మండలాల్లో శనివారం తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండా లని హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంట్లోనే ఉండాలని, ఎండదెబ్బ తగలకుండా టోపి, గొడు గు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని పేర్కొంది.

10 నుంచి సేవా టికెట్ల రుసుము పెంపు

ద్వారకా తిరుమల, మే 3 : ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామికి నిత్యం జరిగే సుప్రభాతం, అష్టోత్తరం, దీపారాధన సేవల టికెట్టు రుసుములను ఈనెల 10 నుంచి పెంపుదల చేస్తున్నట్టు ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. ఇందులో భాగంగా సుప్రభాతసేవ టికెట్ల రుసుము రూ.200 నుంచి రూ.300లకు, అష్టోత్తర శతనామార్చన టికెట్టును రూ.300 నుంచి రూ.500లకు, దీపారాధన సేవను రూ.10 నుంచి రూ.20 లకు పెంచినట్టు వివరించారు.







వచ్చిందే..: పవన్‌కోసం ఎదురుచూపులు



జనం.. జోష్..

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కైకలూరు పర్యటన శుక్రవారం జన సందోహం నడుమ ఉత్సాహంగా సాగింది. మండుటెండలో పవన్ పర్యటన ఆలస్యమైనా జనం ఎదురుచూశారు. ఆలస్యాన్ని అభిమానులు ఉత్సాహంగా మార్చేశారు. బైక్‌లు, ట్రాక్టర్ల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కైకలూరు తాలుకా సెంటర్లో చెట్ల నీడ, చెట్లపైకి ఎక్కి పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు నిరీక్షించారు. పవన్‌కల్యాణ్ రాకతో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


స్మార్ట్ కెమెరా : పవన్‌ను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న అభిమానులు



జెండా పండుగ : ఐక్యంగా జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు


వెయ్.. చిందెయ్ : పవన్ పర్యటనలో అభిమానుల సందడి

అభిమాన పునాది : యువకుడి ఉత్సాహం

ఎలక్షన్ ఏజెంట్

'స్వతంత్ర' రాజకీయం



ఎన్నికల వేళ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏజెంట్ రాజకీయ పాచిక వేశారు. ఎన్నికల సమయంలో తమ అభ్యర్థులు ఓటర్లకు కనిపించేలా ఏజెంట్లను పెంచుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ అందించే ఏజెంట్ల స్థానంలో ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను ఏర్పాటుచేసేందుకు చూస్తున్నారు. దీనిలో భాగంగానే ఈసారి నామినేషన్‌లు దాఖలు చేసిన వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వారంతా పోటీలో నిలిచి వారు ఏర్పాటు చేసుకునే ఏజెంట్లు ప్రధాన పార్టీలకు పని చేస్తారన్న మాట..!

- తాడేపల్లిగూడెం రూరల్

నోటా మెజారిటీ సాధిస్తే..?



ఎన్నికల్లో పోటీ పడిన అభ్యర్థులలో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత. అభ్యర్థులందరి కంటే 'నోటా'కు ఎక్కువ ఓట్లు వస్తే ఏంటి పరిస్థితి. ఏం లేదు సింపుల్.. నోటా తర్వాత అధికంగా ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయంటే పోటీ చేసిన వారిలో ఏ ఒక్క అభ్యర్థి ఓటర్లకు నచ్చలేదని అర్థం. అంటే పరోక్షంగా అభ్యర్థులందరూ ఓడినట్లే లెక్క. అదే న్యాయమని చాలా మంది అభిప్రాయపడతారు. కానీ నిబంధనలు వేరేవిధంగా చెబుతున్నాయి. నోటాకు అధికంగా ఓట్లు పోలైన సందర్భాల్లో వాటిని పరిగణనలోకి తీసుకోరు. ఆ ఓట్లను రద్దయినట్లు ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. నోటా తరువాత అత్యధికంగా ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటిస్తారు. ఇంతకీ ప్రజాభిప్రాయం ఓడిపోయినట్లేనంటారా..!

- అత్తిలి

ట్రెండింగ్.. ట్రెండింగ్..!



వాట్సాప్ స్టేటస్‌లో

నవ మోసాలు


ఎన్నికల్లో అన్నియ్య మంచి ట్రెండింగ్‌లో ఉన్నాడు. అన్నియ్య గొప్పతనం సెల్‌ఫోన్లలో గిరా గిరా తిరుగుతోంది. చాలామంది వాట్సాప్ స్టేటస్‌లలో సెల్ఫ్ ఫోటోలు కాదని మరీ అన్నియ్య ప్రతిభపై ఫొటోలు పెట్టి మరీ వైరల్ చేస్తున్నారు. మా అన్నియ్య సీన్‌లో ఉంటే అంతా మోసమే అంటూ సరదా వ్యాఖ్యలు చేస్తున్నారు. అన్నియ్య నవ రత్నాల మూటను కాస్తా నవ మోసాల చిట్టాగా మార్చేశారు.

విషయానికి వస్తే అధికార పార్టీ హామీలు అమలు చేయలేదని నవ మోసాల ఫొటో సారాంశం. నవ రత్నాల బ్రోచర్‌ను ప్రభుత్వ నవ మోసాల బ్రోచర్‌గా మార్చేశారు. సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా, మద్య నిషేధం, 30 లక్షల ఇళ్ల నిర్మాణం, 45 ఏళ్లకే పెన్షన్, ఏటా జాబ్ క్యాలెండర్, సన్న బియ్యం, పేదలందరికి 200 మీటర్ల ఉచిత విద్యుత్ ఇవన్నీ ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు. నవ మోసాలు అని స్టేటస్ ప్రచారం చేస్తున్నారు. మాటలతో కాదు.. స్టేటస్ చూపిస్తాం అంటున్నారు. ఎన్నికల వేళ ఈ స్టేటస్‌లు వైరల్..!

- భీమవరం రూరల్

షరుకు ఫుల్..

ఏరులై పారుతున్న మద్యం



మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లక్ష్యానికి మించి అమ్మకాలు కొనసాగుతున్నాయి. వైసీపీ నాయకులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రచారాల్లో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు చీప్ లిక్కర్ తాగిస్తున్నారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం మాల్‌లో వాస్తవానికి చీపు లిక్కర్ అమ్మకూడదు. ఇక్కడ ప్రీమియం బ్రాండ్ మందు మాత్రమే విక్రయించాలి. ఆ మాల్ వైసీపీ నాయకుడిది కావడంతో నిబంధనలకు విరుద్ధంగా చీప్ లిక్కర్ అమ్మకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. గుడివాకలంక గ్రామంలో ప్రభుత్వ టూరిజం బార్లో కూడా విచ్చలవిడి అమ్మకాలు సాగిస్తున్న స్థానిక పోలీసులు ఎటువంటి అభ్యంతరం చెప్పడం లేదు. ఏలూరులో ప్రముఖ వైసీపీ నాయకుడి బార్‌లో కూడా ఇదే తంతు సాగుతోందనేది బహిరంగ రహస్యం. ఎన్నికల సంఘం అధికారులు మద్యం అమ్మకాలపై నిఘా ఉంచి సామర్థ్యానికి మించి అమ్మిన ప్రభుత్వ మద్యం దుకాణాలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. శనివారం భారీ స్థాయిలో కోట్లాది రూపాయల మద్యం అమ్మకాలకు రంగం సిద్ధమైంది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అయిన ప్రసన్న వెంకటేశ్ మద్యం అమ్మకాలపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఏలూరు టూ టౌన్

హలో.. ఎవరు గెలుస్తారండీ..



ఎన్నికల వేళ అందరిలో ఒకటే ఆసక్తి.. ఎవరు గెలుస్తారు. జిల్లాలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి.. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది.. ఇదే ఉత్సుకత. అందరికీ ఫోన్ కాల్స్.. హితులు.. సన్నిహితులు.. మిత్రుల ఆరా.. దేశ విదేశాలు, పక్క జిల్లాలో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్‌ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో బంధు వర్గాలకు ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ఎక్కువగా తెలంగాణ నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితోపాటు ఉద్యోగం, చదువులు నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లిన వారు కూడా గెలుపు ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లా వాసులు కూడా పక్క జిల్లాలో, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి అక్కడ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి ఫోన్లో రాజకీయాలపై ఆసక్తి కరంగా చర్చించుకోవడం గమనార్హం.

- అత్తిలి

ఎన్నికల విధులు వద్దు సార్

రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న ఉద్యోగుల వేడుకోలు

తాడేపల్లిగూడెం రూరల్, మే 3: ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించి చాలా రోజులైంది. మినహాయింపు ఇవ్వాలని కోరిన వారికి సైతం విధులు అప్పగించారు. ప్రధానంగా రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వయసు పైబడిన ఉద్యోగులు ఎన్నికల విధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండల్లో దూర ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహించడం తమకు చాలా ఇబ్బంది అని చెబుతున్నారు. తమకు మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ జీవో విడుదల చేసినా కొందరు రిటర్నింగ్ అధికారులు తమకు మినహాయింపు ఇవ్వడం లేదని వాపోతున్నారు. జిల్లాలో 2700 మందిని ఎన్నికల విధులకు కేటాయించగా వారిలో పదుల సంఖ్యలో ఆరు నెలల్లోపు రిటైరయ్యే వారున్నారు. వయస్సు రీత్యా విధులు నిర్వహించలేని పరిస్థితి ఉన్నా కొందరు ససేమిరా అంటున్నారని వాపోతున్నారు. కొందరు మాత్రం రాజకీయ పలుకుబడితో మినహాయింపు పొందినట్లు విమర్శలు ఉన్నాయి.

62 ఏళ్ల మహిళా ఉద్యోగికి విధులు

తాడేపల్లిగూడెంలోని 62 ఏళ్ల ఉపాధ్యాయురాలికి చేతులు పట్టు లేదు. ఆమె జూన్‌లో రిటైర్ కానున్నారు. ఆమెకు ఎన్నికల విధులు కేటాయిస్తూ రిటర్నింగ్ అధికారి నుంచి ఉత్తర్వులు ఇచ్చారు. తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, తనకు ఇబ్బందులు ఉన్నాయని వైద్యుల ధ్రువపత్రంతోపాటు రిటైర్మెంట్ దగ్గరలో ఉన్నవారికి విధులు కేటాయించకూడదన్న జీవో కాపీ కూడా జత చేసి తనకు ఎన్నికల విధులు తప్పించాలని వినతిపత్రం అందించారు. ఆమెకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వకపోవడంతో ఆమె తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

నోట్ల దండలు మాయం

మూడు దశాబ్దాల క్రితం ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల మెడలో నోట్ల దండలు వేసేవారు. అభిమానంతో పాటు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకోసం ఇలా దండలు వేసేవారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలంటే డబ్బే ప్రధానం. దండలు సరిపోవు.. కట్టలు కట్టలు ఉన్న పెట్టెలు కావల్సిందేనని అప్పుడే ఓటు పొందిన కొత్త ఓటరు కూడా చెబుతాడు. గతంలో నిజాయితీ పరులు, సమరయోధులు ఎన్నికల బరిలో నిలిస్తే ప్రజలే వారికి అండగా నిలబడి నోట్లకట్టల దండలు వేసేవారు. అభినందన.. అభిమానం దండగా చేసిన ఆర్థిక సాయం అన్నమాట. అంతేకాదు ఇది అభ్యర్థులకు గౌరవం. అదే సమయంలో ప్రజల్లో తనపై ఎటువంటి అభిప్రాయం ఉందనే సూచికగా కూడా ఉండేది. అప్పటి నాయకుల్లో సేవా తత్పరత ఉండేది. నాటి రోజుల్లో మద్యం ప్రభావం అంతంత మాత్రమే. మద్యం తాగేవారు గ్రామంలో ఒకరో ఇద్దరో ఉండేవారు. ప్రస్తుతం తాగని వారి సంఖ్య ఆ విధంగా ఉందన్న ఆశ్చర్యమే. నాయకులు, ఓటర్లకు కూడా నైతిక విలువలు ఉండేవి. ప్రస్తుతం ఓటర్లకు డబ్బు, మద్యం ఇస్తూ కొంతమంది నాయకులు గెలుస్తున్నారు. ఓటర్లు కూడా ఏ పార్టీ అభ్యర్థి ఇచ్చినా తీసుకుంటూ తమకు నచ్చిన వారికి ఓటు వేస్తున్నారు. డబ్బు తీసుకుని ఓటువేసిన ఓటర్లు నాయకుడిని ప్రశ్నించలేక మౌనం వహిస్తున్నారు. నాటి నోట్ల దండల సంస్కృతే మంచిది.

- ఏలూరు రూరల్

ఖర్చు తడిసి మోపెడు..



ఈసారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, నోటిఫికేషన్, నామినేషన్ల పోలింగ్ తేదీ, ఫలితాలు వెల్లడి మధ్య సుదీర్ఘ సమయం ఉంది. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. పోలింగ్ ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రచార ఆర్భాటానికి భారీ ఖర్చు అవుతుందని, ఇంతగా ఏనాడు లేదని కుయ్యో.. మొర్రో అంటున్నారు. మండుటెండల్లో ప్రచారానికి రోజూ పనులు మానుకుని వచ్చే వారు లేరు. రోజు వారీ మర్యాదలు, ఇతర ఖర్చులు ఉంటాయి. కార్యకర్తలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, టీ, రాత్రికి డిన్నర్ ఏర్పాటు చేయాల్సిందే. మరీ ఎండల్లో తిరుగుతున్నందుకు వారిని కూల్ చేసేందుకు మధ్యలో శీతలపానీయాల సరఫరా చూస్తుంటే ఎన్నికలు ఎప్పుడు ముగుస్తాయి రా బాబూ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కైకలూరులో ఈసారి ప్రచార ఆర్భాటం ఎక్కువగానే ఉంది.

- ముదినేపల్లి



పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

• ఈసీ ఉత్తర్వులు ఇచ్చినా.. అపోహలే • ఫారం -12డి పై ఎన్నికల సంఘం మార్గదర్శకాలు

ఏలూరు రూరల్ / ద్వారకా తిరుమల, మే 3: పని చేసేది ఒక చోట.. ఓటు ఉన్నది ఇంకొక చోట.. ఎన్నికల విధులు నిర్వహించేది మరొక చోట.. ఇంతకీ పోస్టల్ ఓటు ఏ అధికారికి ఇవ్వాలి.. ఉద్యోగుల గందరగోళం ఇది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఏపీవోలు, ఇతర సిబ్బంది తమ ఫారం-12డి ఎక్కడి ఏఆర్వోకు ఇవ్వాలనేది ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఉద్యోగి పనిచేస్తున్న నియోజకవర్గంలోని ఏఆర్వోకే ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. అయినప్పటికీ ఇంకా కొంతమందికి అనేక సందేహాలు.

పోస్టల్ బ్యాలెట్‌పై గత నెల 20న ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగి ఓటు నియోజకవర్గం, జిల్లాలో ఉన్న ఫారం -12డి మాత్రం పని చేస్తున్న నియోజకవర్గ కేంద్రంలో ఏఆర్వోకు ఇవ్వాలి. ఈ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. ఏఆర్వోలు తమ వద్దకు వచ్చిన ఫారం - 12డి ఆర్వోలకు పంపాలి. వాటిలో సొంత నియోజకవర్గానివి ఆర్వోల వద్దనే ఉంచుకుని ఇతర నియోజకవర్గాలు, జిల్లాలవి జిల్లా ఎన్నికల అధికారికి పంపాలి. జిల్లాలోనే వేరే నియోజకవర్గంలో ఉద్యోగి ఓటు ఉంటే అక్కడి ఆర్వోకి సంబంధిత ఫారం-12 డి జిల్లా ఎన్నికల అధికారికి పంపాలి. ఇతర జిల్లా వారి ఫారం ఓటర్ ఐడీతో జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత డీఈవోకు పంపించాలి. సీఈసీ గతనెల 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏ జిల్లాకు ఆ జిల్లా ఫారం మార్పిడికి ఫస్ట్ సెంట్రల్ ఎక్ఛేంజ్ పేరుతో కార్యక్రమం నిర్వహించింది. పోస్టల్ బ్యాలెట్‌లను సంబంధిత ఆర్వోల వద్ద నుంచి తెప్పించి మే 3న జరిగే సెకండ్ సెంట్రల్ ఎక్ఛేంజ్ రోజున వాటిని అందజేస్తారు. పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారు ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు మే5న, మే 6న పోలీస్ సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులకు మే 7న, ఇతర జిల్లా ఓటర్లకు మే 8న నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించని వాటని అనెక్షర్ 6లో పేర్కొంటూ మే 10న వెలగపూడి సచివాలయంలో నిర్వహించే థర్డ్ సెంట్రల్ ఎక్ఛేంజ్‌లో అందజేయాలి.

పోస్టల్ బ్యాలెట్ ఎక్కడ..

పోలింగ్ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు కొన్ని ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఎక్కడ అన్న సంశయం ఏర్పడుతోంది. ఏలూరు జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ ప్రక్క జిల్లాలో ఓటు ఉన్నఉద్యోగుల పోస్టల్‌బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఎక్కడ అనేది అధికారులు స్పష్టం చేయడం లేదని కొందరు ఉద్యోగులు అంటున్నారు. ఓటు ఉన్న నియోజకవర్గంలో వేయాలా.... లేదా ఎన్నికల విధులు ఉన్న చోటు వేయాలా అన్నది ప్రశ్నార్థకంగా ఉందన్నారు.



పోలింగ్ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో బ్యాలెట్‌లను పోస్టు ద్వారా ఇంటికి పంపేవారు. ఉద్యోగులు ఓటు వేసి తిరిగి పోస్ట్‌లో వాటిని పంపేవారు. ఇది చాలా సులభంగా ఉండే విధానం. కొన్నేళ్లుగా ఆ విదానాన్ని పక్కన పెట్టి ఓటు ఉన్న నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్‌బూత్ ఏర్పాటు చేస్తున్నారు.

ఇక్కడ పరిస్థితి ఏంటి

ద్వారకాతిరుమల మండలం పరిపాలనాపరంగా ఏలూరు జిల్లా పరిధిలో ఉంది. నియోజకవర్గం తూర్పుగోదావిరి జిల్లా గోపాలపురం. ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు ఉపాధ్యాయులకు ఓట్లు గోపాలపురం నియోజకవర్గంలో ఉన్నాయి. అక్కడి రిటర్నింగ్ అధికారిని పోస్టల్ బ్యాలెట్ పై సంప్రదిస్తే ఎన్నికల విధులు ఉన్న చోటే ఓటు వేయాలంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఓటు ఉన్న నియోజకవర్గంలో ఓటు వేయాలంటున్నారని వారు వాపోతున్నారు. తాము పోస్టల్ బ్యాలెట్‌ను ఎక్కడ వినియోగించుకోవాలో సరైన ఆదేశాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. మండలంలో ఒక ఉపాధ్యాయుడికి ఓటు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఉంది. ఎన్నికల విధులు కైకలూరు నియోజకవర్గం. ఆ ఉపాధ్యాయుడు ఇద్దరు ఆర్‌ఓలను సంప్రదిస్తే నిరాకరిస్తున్నారని చెబుతున్నారు.

ఫారం 12కి దరఖాస్తు చేసుకున్నా ఇబ్బందులు

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులంతా ఫారం -12కు దరఖాస్తు చేసినా ఓటుహక్కు వినియోగించుకోవడానికి కిందిస్థాయిలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫారం -12 దరఖాస్తు చేసినా, చేయకపోయినా ప్రభుత్వ ఉద్యోగులందరికి నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఇవ్వాలి. ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులందరికి ఓటుహక్కు అవకాశం కల్పించాలి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారిని కోరాం. వారం రోజుల క్రితం ఇదే విషయమై ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లాం. కాని ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం విచారకరం. చాలామంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో ఫారం -12పై మే 1లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. చాలామంది అంగన్‌వాడీ టీచర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించారు. వారందరు కూడా ఫారం -12 దరఖాస్తు చేసుకోలేదు. వారికి కూడా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలి. ఫారం -12తో సంబంధం లేకుండా ఫెసిలిటేషన్ సెంటర్లో పీవో, ఏపీవోలతో నియోజకవర్గస్థాయిలో మిగిలిన ఉద్యోగులందరికి కూడా పోలింగ్ రోజు నేరుగా వెళ్లి ఓటుహక్కు వేసుకునే వెసులుబాటు కల్పించాలి. లేకుంటే చాలామంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోలేరు. ప్రభుత్వ ఉద్యోగులందరికి ఓటుహక్కు వినియోగించుకునేలా రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి.

భూపతిరాజు రవీంద్రరాజు, వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు


నారాయణపురంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పరిశీలన

బ్యాలెట్ లోడింగ్..

వీవీ ప్యాట్‌లో సింబల్స్ అమరిక

సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం దగ్గర పడుతోంది. అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు అధికారులు పోలింగ్‌కు పూర్తిగా సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు సింబల్స్ కేటాయించడంతో వాటిని వీవీ ప్యాట్‌లలో అమరుస్తున్నారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం నారాయణపురం హైస్కూలులో ఈవీఎంలు పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి ఖాజావలి పర్యవేక్షణలో వీవీ ప్యాట్‌లకు సింబల్స్‌ను అమర్చారు.

- ఉంగుటూరు



వాణిజ్య కేంద్రంగా పాలకొల్లు

వాణిజ్య కేంద్రంగా పాలకొల్లు ఎగుమతులకు ప్రసిద్ధి గాంచింది. బత్తాయి, నిమ్మ, కొబ్బరి ఎగుమతులకు పాలకొలు పెట్టింది పేరు. ఇతర ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో గణనీయంగా కొబ్బరి ఉత్పత్తులు పెరగడంతో ఇక్కడ కొబ్బరి సాగు తగ్గింది. అలాగే నిమ్మకాయలు కూడా ఇక్కడ నుంచి ఎగుమతులు అయ్యేవి. నిమ్మ పంట కూడా తగ్గడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ఆ ప్రాంతం ధాన్యానికి ప్రఖ్యాతి. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో సుమారు 70 వరకూ రైస్ మిల్లులు ఉండేవి. ఇప్పుడు ధాన్యం పంట తగ్గింది. చెరువులు అభివృద్ధి చెందాయి. దాంతో రైస్ మిల్లులు గోదాములు, కల్యాణ మండపాలుగా మారిపోయాయి. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వస్త్ర వ్యాపారానికి పాలకొల్లు ప్రసిద్ధి చెందింది. 1980లలోనే ఏడాదికి కోటి రూపాయల వరకూ టర్నోవర్ చేసిన వస్త్ర దుకాణాలు ఉండేవి. పెళ్ళిళ్ళకు ఇతర శుభ కార్యాలకు ఇప్పటికీ ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. చేనేత రంగంలో కూడా నూలు వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఉండేవారు. చేనేతకు ప్రసిద్ధి చెందిన గ్రామాలు ఉండేవి.

కళాకారుల నిలయం



అల్లు రామ లింగయ్య

దాసరి నారాయణరావు

కోడి రామకృష్ణ

కాళాకారులెందరికో పాలకొల్లు జన్మనించింది. ఇక్కడ పుట్టిన పెరిగిన వారు రంగస్థలం, సినీ రంగాలను ఏలారు. నల్ల రామ్మూర్తి రంగస్థలం, సినీ రంగంలో ప్రసిద్ధి చెందారు. తెలుగు సినీరంగంలో ప్రముఖ హాస్యనటుడు అల్లూ రామలింగయ్య ఇక్కడివారే. రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి పాలకొల్లు రూరల్ మండలం వాసి. సినీ రంగాన్ని ఒంటి చేత్తో ఏలిన దర్శకులు దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణలు పాలకొల్లు వారు కావడంతో కళా రంగమంటే పాలకొల్లు అన్నంతగా ఎదిగింది. రేలంగి నరసింహరావు వంటి దర్శకులు కూడా పాలకొల్లుకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. కళారంగంలో ఎందరో నటీ నటులు కూడా ఇక్కడి వారే ఉన్నారు. నాటక కళాపరిషత్‌లు ప్రతి ఏటా జాతీయ స్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తుంటాయి. రంగస్థలం, సాంఘిక నాటక రంగాలకు పాలకొల్లు పుట్టినిల్లు. ప్రతి సంవత్సరం నాటక పోటీలు నిర్వహించేందుకు కళాపరిషత్‌లు పోటీ పడేవి.

ప్రఖ్యాతిగాంచిన పంచారామం

రాష్ట్రంలో ఆధ్యాత్మికంగా ప్రఖ్యాతి గాంచిన పంచారామక్షేత్రాల్లో ఒకటైన క్షీరారామం పాలకొల్లులో ప్రసిద్ధి చెందిన ఆధ్మాతిక తీర్థం. క్షీరా రామలింగేశ్వర స్వామి ఇక్కడ కొలువు తీరారు.రాష్ట్ర నలమూలలనుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. కార్తీక మాస పర్వదినాలు, మహా శివరాత్రి పర్వదినాల్లో ఇతర రాష్ట్రాల భక్తులు పాలకొల్లు వచ్చి క్షీరా రామ లింగేశ్వరస్వామిని దర్శించుకుని వెళుతుంటారు. వైష్ణవ ఆలయం అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయం పాలకొల్లులో కొలువుదీరాయి.

కళల నిలయం

ఫ్లాష్ బ్యాక్

పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు వాణిజ్య, ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. కళలకు కాణాచి పాలకొల్లు. ఎందరో రాజకీయ దురంధరులు ఇక్కడ విజయం సాధించారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. వాణిజ్య కేంద్రంగానూ, ఆధ్యాత్మిక కేంద్రంగానూ, కళారంగాలకు పుట్టెల్లుగా పిలువబడే పాలకొల్లు రాజకీయంగానూ పేర్గాంచింది. పాలకొల్లు నియోజక వర్గం ఏర్పడినప్పటి నుంచి 14 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో 6 సార్లు కాంగ్రెస్, ఒక సారి సీపీఎం విజయం సాధించగా 1983లో టీడీపీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం హవా నడుస్తోంది. ఏడు పర్యాయాలు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

- పాలకొల్లు అర్బన్

నియోజకవర్గం : పాలకొల్లు
మొత్తం ఓటర్లు : 1,95,050
పురుషులు : 95,245
మహిళలు : 98,841
ఇతరులు : 6

టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీదే హవా

వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి

పంచారామ క్షేత్రంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం



అంతరించిన పాలకొల్లు బత్తాయి

పాలకొల్లు ప్రాంతం బత్తాయికి ప్రసిద్ధి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బత్తాయి దేశం నలుమూలలకు ఎగుమతి అయ్యేవి. సినిమా పాటల్లోనూ పాలకొల్లు బత్తాయికి చోటు లభించింది. వందలాది ఎకరాల్లో తోటలు ఉండేవి. ఒక్కడ పండిన బత్తాయి చూడడానికి మంచి సొగసుగా ఉండేది. రుచికూడా అంతే. క్రమేణా బత్తాయి తోటలు అంతరించి పోయాయి. యలమంచిలి మండల పరిధిలోని కొన్ని లంకల్లో మాత్రమే బత్తాయి తోటలను పెంచుతున్నారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1955	అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి	కాంగ్రెస్	బి.లక్ష్మీనరసరాజు	సీపీఐ	1,450
1955	దాసరి పెరుమాళ్ళు (ఎస్సీ రిజర్వుడు)	కాంగ్రెస్	ఎస్ఎస్‌రావు	సీపీఐ	1,432
1962	అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి	కాంగ్రెస్	పొలిశెట్టి శేషావతారం	సీపీఐ	3,332
1967	పొలిశెట్టి శేషావతారం	సీపీఐ	సూర్యరాజు	కాంగ్రెస్	7,256
1972	చేగొండివెంకట హరరామజోగయ్య	కాంగ్రెస్	చోడిశెట్టి సూర్యారావు	స్వతంత్ర	15,088
1978	వర్ధినీడి సత్యనారాయణ	కాంగ్రెస్	చోడిశెట్టి సూర్యారావురెడ్డి	కాంగ్రెస్	13,063
1983	అల్లు వెంకట సత్యనారాయణ	టీడీపీ	వర్ధినీడి సత్యనారాయణ	కాంగ్రెస్	26,575
1985	అల్లు వెంకట సత్యనారాయణ	టీడీపీ	వర్ధినీడి సత్యనారాయణ	కాంగ్రెస్	20,574
1989	సీహెచ్‌వీ హరరామజోగయ్య	కాంగ్రెస్	అల్లు సత్యనారాయణ	టీడీపీ	1,394
1994	అల్లు వెంకట సత్యనారాయణ	టీడీపీ	హరరామజోగయ్య	కాంగ్రెస్	14,400
1999	అల్లు వెంకట సత్యనారాయణ	టీడీపీ	మెంటే పద్మనాభం	కాంగ్రెస్	11,420
2004	త్సవటపల్లి సత్యనారాయణమూర్తి	టీడీపీ	గుణ్ణం నాగబాబు	కాంగ్రెస్	12,001
2009	బంగారు ఉషారాణి	కాంగ్రెస్	కొణిదల చిరంజీవి	ప్రజారాజ్యం	5,446
2014	నిమ్మల రామానాయుడు	టీడీపీ	మేకా శేషుబాబు	వైసీపీ	6,383
2019	నిమ్మల రామానాయుడు	టీడీపీ	సత్యనారాయణమూర్తి	వైసీపీ	17,809



ఉద్యాన పంటలకు ప్రత్యేకత

ఉద్యాన రంగంలో ప్రధానంగా కొబ్బరికి పాలకొల్లు ప్రసిద్ధి. ఇప్పటికీ పాలకొల్లు నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో కొబ్బరి తోటలున్నాయి. ఇక్కడి నుంచే ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతుంటుంది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో గడచిన ఐదేళ్లలో రైతులు నీరుగారి పోయారు. కొబ్బరి సాగును వదులుకుంటున్నారు. తోటలను తీసేస్తున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోనే కొబ్బరి ఎగమతిదారులు అనేక మంది ఉన్నారు. దశాబ్దాలుగా అదే వ్యాపారంలో స్థిరపడ్డారు.

కేంద్రమంత్రిగా దాసరి

కేంద్రమంత్రి వర్గంలో దాసరి నారాయణ రావు రెండేళ్లపాటు పనిచేశారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా వ్యవహరించారు. సీనియర్ రాజకీయ నేత చేగొండి హరిరామ జోగయ్య రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరిరామ జోగయ్య హోంమంత్రింగా పనిచేశారు. పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. రాజశేఖర రెడ్డి హయాంలోనూ జోగయ్య రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. రెండు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యే అయిన ఘనత నిమ్మల రామానాయుడిది. ఇప్పుడు హ్యాట్రిక్ కోసం శ్రమిస్తున్నారు.





తణుకు ఇండియన్ బ్యాంకు వద్ద భారీగా చేరిన పింఛన్‌దారులు



ఇరగవరంలో నడవలేని స్థితిలో కుటుంబ సభ్యుల సహకారంతో వస్తున్న వృద్ధురాలు



పెంటపాడు బ్యాంక్ ఆఫ్ ఇండియా బయట పడిగాపులు

అవ్వా, తాతల అవస్థలు

రెండో రోజు కొనసాగిన పింఛన్ కష్టాలు
బ్యాంకుల వద్ద పడిగాపులు
ఎండధాటికి తాళలేక ఇక్కట్లు
అక్కౌంట్లు డెడ్ అయ్యాయంటూ పంపేస్తున్న సిబ్బంది



ఏలూరుసిటీ, మే 3: పెన్షన్ దారులకు తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం కూడా పెన్షన్ దారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. పింఛన్ దారులకు రెండోరోజు కూడా కష్టాలు తప్పలేదు. పింఛన్‌సొమ్ములు తీసుకోవటానికి బ్యాంకులకు వెళ్లితే డిపాజిట్ అని, చార్జీలని కోత విధించి మిగిలిన సొమ్ములు మాత్రమే ఇస్తున్నారని పలువురు పింఛన్‌దారులు వాపోతున్నారు. కొంత మంది బ్యాంకులకు వెళ్లలేక ప్రైవేటు నిర్వహణలో ఉండే మినీ ఏటీఎం సెంటర్లవద్దే కొంత ఖర్చయినా సొమ్ములను విత్‌డ్రా చేసుకుంటున్నారు. చాలామంది మందుల కొనుగోలు, నిత్యా వసరాలకోసం దుకాణాల్లో అప్పులు పెడుతుంటారు. ఒకటో తేదీన పింఛను అందిన వెంటనే చెల్లిస్తారు. ఈనెలలో పింఛను సొమ్మును బ్యాంకుల్లో జమచేయడంతో సొమ్ము తీసుకోవడానికి వృద్దులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇరగవరం : ఇంటింటికి పంపిణీ చేపట్టడానికి సిబ్బంది తగినంత మంది ఉన్నా జగన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వృద్ధులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 42 డిగ్రీలు దాటుతున్న మండే ఎండల్లో పింఛన్‌దారులను బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతోందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మండు టెండలో చేతికర్ర సాయంతో, మరికొందరు కుటుంబీకుల సహకారంతో నడవలేని స్థితిలో అతి కష్టం మీద వచ్చి గంటల తరబడి బ్యాంకుల వద్ద నిరీక్షించారు. ఇరగవరంలో 9,613 మంది పింఛన్ దారులున్నారు. వీరిలో 2,783 మందికి ఇళ్ల వద్ద ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

తణుకు : పింఛన్ల కోసం పలువురు వృద్ధులు బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు. శుక్రవారం తణుకులో ఎత్తున బ్యాంకులకు పింఛన్‌దారులు చేరారు. చాలామందికి ఖాతాలు పనిచేయక పోవడం వంటి కారణాలతో ఇబ్బందులు పడ్డారు

పెంటపాడు : పెన్షన్‌దారులు ఒకేసారి రావడంతో పెంటపాడు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద గేట్లు మూసేశారు. దీంతో బ్యాంక్ బయటే పడిగాపులు కాశారు. ఒక వైపు మండుటెండ మరొక వైపు ఉక్కబోతతో అల్లాడి పోయారు. తాగడానికి గుక్కెడు మంచినీళ్ల కూడా లేని వారి అవస్థ చూడలేక పెంటపాడు టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అప్పటికప్పుడు మజ్జిగ తయారు చేయించి బ్యాంక్ ఆఫ్ ఇండియా , యూనియన్ బ్యాంకు వద్ద వృద్ధులకు అందజేశారు. రెండు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని బ్యాంకు వారు మాత్రం ఈ రోజు రేపు అంటూ తమతో ఆటలాడుకుంటున్నారంటూ లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్కార్ చేసే పనులకు వృద్ధులు ఎండలో మగ్గిపోతున్నారంటూ కిలపర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ ఖాతాలు రన్నింగ్‌లో లేవని ఫలానా రోజు రావాలంటూ సిబ్బంది చెప్పడంతో ఉసూరుమంటూ వెనక్కి మళ్లుతున్నారు.

లింగపాలెం : లింగపాలెంలో బ్యాంకులు, సేవకేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. బ్యాంకులు వెళుతుంటే ఈకేవైసీ కాలేదంటూ జిరాక్స్ సెంటర్ల చుట్టూ, బ్యాంకుల చుట్టూ ఎండలో తిప్పుకుంటున్నారని వాపోయారు. సచివాలయాల్లో సిబ్బంది ఉన్నా వారి ద్వారా పంపిణీ చేయకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెంకదుతున్నారు.

పెదవేగి :పింఛను సొమ్ము తీసుకోవడానికి అధికసంఖ్యలో బ్యాంకులకు రావడంతో వృద్ధులు సొమ్ము తీసుకోవడానికి పడిగాపులు పడ్డారు. లైనులో నిల్చోలేక వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.పెదవేగి మండలంలో సుమారు 12 వేలమంది పింఛనుదారులు ఉండగా తొమ్మిది వేల మందివరకు పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాలో జమచేశారు.

ఆకివీడు : రాజకీయాలకు తాము నలిగిపోతున్నామని వృద్ధులు, దివ్యాం గులు వాపోతున్నారు. శుక్రవారం కూడా బ్యాంకుల్లో క్యూలో గంటల తరబడి ఉండాల్సి వచ్చింది.ఆశా వర్కర్లు ఓఆర్ఎస్ అందచేశారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలో గ్రామ పంచాయతీ శివారు చిర్రివారి గూడెం, తాటియాకులగూడెం గ్రామాల వృద్ధులు పెన్షన్ కోసం బ్యాంకు ఆఫ్ బరోడా వద్దకు వచ్చారు. బ్యాంకు ఎకౌంటుకు ఆదార్ లింక్ కాలేదని, అకౌంట్ డెడ్ అయ్యిందని చెప్పటంతో నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది.



పెదవేగి బ్యాంకులో ఎదురు చూస్తున్న వృద్ధులు

రెండురోజులుగా తిప్పుకుంటున్నారు



నాపేరు బొడ్డు శంకర్. మా అమ్మ బొడ్డు కృష్ణ వేణి పెన్షన్ లబ్ధిదారు. ఎవరోఒకరు తోడుగా ఉంటేగాని నడవలేదు. గురువారం బ్యాంకుకు వచ్చాం. ఆధార్ కార్డు లేదని వెళ్ళిపోమన్నారు. ఈ రోజు మళ్లీ వచ్చాం. మంగళవారం రమ్మంటున్నారు. ఇలా చేస్తే ఎండలో వృద్ధులకు ఎంత ఇబ్బందిగా ఉంటుంది

-బొడ్డు కృష్ణవేణి, పెంటపాడు

ఈ రోజు ఇస్తారో..లేదో ?



మాది ముదునూరు అరుందతి పేట. గురువారం జనం ఎక్కువగా ఉంటారని రాలేదు. ఈ రోజు వచ్చాను. ఈ రోజు కూడా ఎక్కువ గానే ఉన్నారు. గేట్లు వేసేయడంతో బయటే కూర్చున్నాను. ఇంకా లోపలకి వెళ్లలేదు. పెన్షన్ వస్తుందో లేక రేపు రమ్మంటారో తెలియదు.

- మెరుపు నాగమ్మ, ముదునూరు

ఇంకో రోజైతే మంచాన పడాల్సిందే



మాది గార్లమడుగు. ప్రతినెలా ఇంటికే వచ్చి పింఛను అందించే వారు. బ్యాంకులో వేయ డంతో గార్లమడుగు నుంచి పెదవేగిలో బ్యాంకుకు వచ్చి సొమ్ము తీసుకోవాల్సి వచ్చింది. ఇంకోరోజు ఇలాగే ఎండలో వస్తే మంచాన పడాల్సిందే.

- భీమడోలు గోయ్యమ్మ, గార్లమడుగు

ఆధార్ లింక్ కాలేదన్నారు



పెన్షన్ డబ్బులు కోసం వస్తే ఆధార్ లింక్ కాలేదంటు న్నారు. వేరే బ్యాంకులో అక్కౌంటు ఉందేమో చూసుకో మన్నారు. దీంతో ఎండకు ఎటు వెళ్లే లేక మధ్యాహ్నం వరకు బ్యాంకు వద్దే ఉండిపోయా. కొందరు గ్రామంలో నెట్ సెంటర్‌కు వెళ్లి వెయ్యికి 20 రూపాయలు చెల్లించి పెన్షన్ డబ్బులు తీసుకుంటున్నారు.

- సరియం దుర్గమ్మ, చిర్రివారిగూడెం

అక్కౌంట్ డెడ్ అయ్యిందంటున్నారు



పింఛన్ డబ్బులు కోసం బ్యాంకు వెళ్లా. లైన్ ఉండ టంతో కొంత సేపటి తర్వాత వెళితే బ్యాంకు సిబ్బంది అక్కౌంట్ డెడ్ అయ్యింది.. సోమవారం రమ్మని చెప్పారు. ఏం చేయాలో తెలియడం లేదు. ఇంత ఎండల్లో మళ్లీ ఎలా రాగలను. మొన్నటిలాగే పంచాయతీ కార్యాలయం వద్దే ఇస్తే బావుండేది.

-పొడియం దూలమ్మ, చిర్రివారిగూడెం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్, మోటారు సైకిల్

ఎస్ఈబీ దాడులు
18 కేసులు నమోదు..15 మంది అరెస్టు

ఏలూరు క్రైం, మే 3 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నాటుసారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు.శుక్రవారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్ పోస్టుల వద్ద సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయ దారులపై 2 కేసులు నమోదు చేసి వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1700 లీటర్ల బెల్లపుఊట ద్వంసం చేసి 2 కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 12 కేసులు నమోదు చేసి 97.32 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాన్‌డ్యూటీపెయిడ్ మద్యం కల్గి ఉన్న రెండు కేసులు నమోదు చేసి 36.75 లీటర్ల మద్యం, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 18 కేసులలో 15 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ స్వరూపరాణి

రిజర్వు బలగాలను వినియోగించండి
అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, మే 3 : సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి గ్రామంలోనూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని అదనపు ఎస్పీ స్వరూపరాణి అన్నారు. జిల్లాకు వచ్చిన నాగాలాండ్ రిజర్వు పోలీసు దళాల అధికారులతో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. స్వరూపరాణి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలీసు శాఖ భరోసా కల్పించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో గంజాయి, నాటుసారా, అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడానికి నాగాలాండ్ రిజర్వు పోలీసు దళాలను వినియోగించాలన్నారు. ఎన్నికల అనంతరం ఇవిఎం బాక్స్‌లను కౌంటింగ్ సెంటర్లలో భద్రపర్చిన తరువాత వాటి భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసు కోవాల న్నారు. ఎఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీటీసీ డీఎస్పీ ప్రభాకరరావు, నాగాలాండ్ రిజర్వు పోలీస్ కమాండెంట్ ముఖేష్ షియో తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై కుటుంబరావు, నాగాలాండ్ రిజర్వు పోలీస్ దళాలతో గ్రామంలో పాత బస్టాండు నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



ఎవరు గెలిచినా మీదే గెలుపు
జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆచంట				
2. పాలకొల్లు				
3. నరసాపురం				
4. భీమవరం				
5. ఉండి				
6. తణుకు				
7. తాడేపల్లిగూడెం				
8. ఉంగుటూరు				
9. దెందులూరు				
10. ఏలూరు				
11. పోలవరం				
12. చింతలపూడి				
13. గోపాలపురం				
14. కొవ్వూరు				
15. నిడదవోలు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా - 534 166.



పోలవరంలో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు, జానీ మాస్టర్

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు
- పోలవరంలో సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ప్రచారం

పోలవరం, మే 3 : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పోలవరం కూటమి అసెంబ్లీ అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం పోలవరంలో గ్రామ దేవత కడమ్మ తల్లికి బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ప్రస్తుత పాలన పోవాలని కూటమి పాలన రావాలని కూటమి అభ్యర్థులు ఏలూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌కి సైకిల్ గుర్తుపై, పోలవరం అసెంబ్లీ అభ్యర్థి చిర్రి బాలరాజుకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం బైక్‌లు, వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులపై ర్యాలీ నిర్వహించి కూటమి ఐక్యత వర్ధిల్లాలి, చంద్రబాబు పవన్‌కల్యాణ్, మోదీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు.

నేడు, రేపు.. పీవో, ఏపీవోలకు శిక్షణ

పెదపాడు, మే 3 : దెందులూరు నియోజకవర్గానికి నిమితులైన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 4, 5వ తేదీల్లో వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు దెందులూరు ఆర్వో, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. రెడ్డి మహిళా కళాశాలలో భద్రపరిచిన వీవీ ప్యాట్‌ల నందు బెల్ కంపెనీ ఇంజనీర్ల సాయంతో నెం.64 దెందులూరు నియోజకవర్గం, నెం.10 ఏలూరు పార్లమెంట్‌కు పోటీచేయు అభ్యర్థుల గుర్తుల లోడింగ్ కార్యక్రమాన్ని ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మహిళా కళాశాల పీజీ బ్లాక్‌లో 4,5వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీ సెంటర్‌ను చేయడం జరిగిందని, దెందులూరు అసెంబ్లీ నియోజవర్గంలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, పీవో, ఏపీవోలు, సహాయ పోలింగ్ సిబ్బంది, పోలీసు డిపార్ట్‌మెంట్, అత్యవసర సర్వీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

సమాజాన్ని పీడిస్తున్న సమస్య 'మానవ అక్రమ రవాణా'



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, మే 3 : మానవ అక్రమ రవాణా నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య అని దీనిని అధిగమించడానికి సంబంధిత అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రత్నప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న లోక్‌అదాలత్ భవనంలో పలు శాఖల అధికారులతో శుక్రవారం 'మానవ అక్రమ రవాణా-బాధితుల పరిహారం' అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అక్రమ రవాణా నిరోధించడం, బాధితులను గుర్తించడం, ఆ బాధితులకు రక్షణ పునరావాసం కల్పించడం వంటి చర్యలు సత్వరం తీసుకోవాలన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పీడీ పద్మావతి, డీసీపీవో సూర్యచక్రవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాలరావు, హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు, మహిళా ఎస్ఐ కాంతిప్రియ, డీసీఆర్బీ ఏఎస్ఐలు సిసిలి, రుక్మందనరావు, పారాలీగల్ వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.

పద్మశాలీల సంఘం జిల్లా కార్యదర్శిగా గిడుతూరి



ఏలూరు రూరల్, మే 3: ఉమ్మడి జిల్లా పద్మశాలీల సంఘం జిల్లా కార్యదర్శిగా ఏలూరు నగరానికి చెందిన గిడుతూరి సత్యనారాయణను నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వానపల్లి నాగరాజు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఉమ్మడి జిల్లా పద్మశాలీ కుల అభివృద్ధి కోసం ఉన్నత ఆశయాల కోసం పనిచేయాలని సూచించారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేశారు.

జనసేనలోకి నారాయణపురం వైసీపీ కార్యకర్తలు



జనసేనలో చేరిన నాయకులతో పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు, మే 3 : పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పేదల సేవకు అంకితం కావాలని జనసేన ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జనసేన కార్యాలయంలో నారాయణపురం వైసీపీ కార్యకర్తలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గురువెల్లి రాంబాబు, శ్రీను, బొమ్మిడి అనిల్, శివ మరి కొంతమంది ఉన్నారు.

విద్యావేత్త సుగ్గిశెట్టి సత్యనారాయణ మృతి



సత్యనారాయణ (ఫైల్)

దెందులూరు, మే 3 :జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన దెందులూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘం నేత విజయ నగేష్ డీఈడీ, నర్సింగ్ కాలేజీల వ్యవస్థాపక చైర్మన్ సుగ్గిశెట్టి సత్యనారాయణ మృతి చెందారు. శుక్రవారం దెందులూరులో ఆయన ఇంటి వద్ద అనారోగ్యంతో మరణించారు. ఆయన పార్థివదేహాన్ని పలువురు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అయన కుమారుడు మానవత సంస్థ కార్యదర్శి సుగ్గిశెట్టి నూకరాజును పలువురు పరామర్శించి సానుభూతి తెలిపారు. అంతిమ యాత్రలో పలు రాజకీయ, విద్యా, వైద్య రంగాలకు చెందినవారు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్య అభ్యసించాలి



విద్యార్థుల ప్రదర్శనలు

ఉంగుటూరు, మే 3 : నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా మంచి భవిష్యత్తును పెంపొందించుకోవచ్చని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు కోరారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థి బృందం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యనభ్యసించడం ద్వారా మంచి ఉద్యోగ ఉపాధికి అర్హత సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనలు

ఏలూరు కార్పొరేషన్, మే3. చైత్రమాసం ఆఖరి శుక్రవారం, బహుళ దశమి, శతాభిష నక్షత్ర పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక అంబికాదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో రాహుకాలంలో సామూహికంగా శ్రీచక్రకుంకుమార్చనలు జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తిసంకీర్తనలు ఆలపించి భజనలు చేసి, లలితాపారాయణం నిర్వహించారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

పోలవరం, చింతలపూడి పూర్తి చేస్తాం

- ఎన్డీఏ కూటమి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి : ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

టి.నరసాపురం, మే 3 : ఎన్డీఏ కూటమి గెలుపునకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఏలూరు పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం టి.నరసాపురం మండలంలో సాయంపాలెం, బొర్రంపాలెం, వెంకటాపురం, తిరుమలదేవిపేట నుంచి అప్పలరాజుగూడెం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజుతో కలసి ఆయన ఆయా గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో జగన్మోహన్‌రెడ్డి అధిక ఆస్తులు సంపాదించారని, పేదలు పేదలుగానే ఉండిపోయారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, ఈ రెండు పూర్తయితే మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, రైతన్న పొలంలో బంగారం పండుతుందన్నారు. వీటితోపాటు నిర్వాసితులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరించే వరకు వారిని ఆదుకుంటామన్నారు. తనపై మంత్రి కుమారుడు పోటీ చేస్తున్నాడని మంత్రిగా ఉండి ప్రజలకు చేయలేనిది ప్రస్తుతం కుమారుడు ఏం చేస్తాడని ప్రశ్నించారు. టీడీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, డ్యాన్స్ మాస్టర్ జానీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామూర్తి, టీడీపీ సీనియర్ నాయకుడు శీలం వెంకటేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావుగౌడ్, మాజీ జడ్పీటీసీ నల్లూరి వెంకటచలపతిరావు, జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, గండబోయిన శ్రీను, మండల అధ్యక్షుడు మాలింపాటి హరిబాబు ఉన్నారు.



టి.నరసాపురం మండలంలో ప్రచారం చేస్తున్న పుట్టా మహేష్‌యాదవ్, చిర్రి బాలరాజు దృశ్యాలు

వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

- ఉంగుటూరు కూటమి అభ్యర్థి ధర్మరాజు



గణపవరంలో ప్రచారం చేస్తున్న పత్సమట్ల ధర్మరాజు

గణపవరం/భీమడోలు మే 3: వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని కూటమి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని ఉంగుటూరు నియోజకవర్గ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయ కులు, శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిం చారు. ధర్మరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ళు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. నియోజక వర్గ గ్రామాల్లో సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని సమస్యల పరిష్కారానికి ఓటు ద్వారా తనను ఆశీర్వదించాలని కోరారు. మహిళలు హారతులు పట్టి గజమాలతో ధర్మరాజును సత్కరించారు. జనసేనలోకి చేరిన పలువురు కార్యకర్తలను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, జనసేన నాయకు లు తోట శ్రీనివాసరావు, బద్దారపు పుల్లయ్య, ముత్యాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆగడాలలంకలో ప్రచారం..

ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేత పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తామని కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పత్స మట్ల ధర్మరాజు, జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంట సాల వెంకటలక్ష్మి అన్నారు. భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించి, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



బ్రాహ్మణ మేనిఫెస్టో విడుదల చేస్తున్న బడేటి చంటి, ప్రజాసంకల్పయాత్రలో బడేటి కుటుంబ సభ్యులు

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తాం

- ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మే 3: బ్రాహ్మణ సంక్షేమానికి హిందూ ధర్మపరిరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఏలూరు అసెంబ్లీ నియోజజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తెలిపారు. దేవాలయాల్లో హిందూ ధర్మపరిరక్షణ, బ్రాహ్మణ సంక్షేమంపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోను ఏపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ ఎంటీఎస్.శర్మ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం 2014లో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేసి బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిందన్నారు. బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసమస్యలన్నింటిని పరిష్కరిస్తామని బడేటి చంటి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 49వ డివిజన్ అమ్మవారి గుడి నుంచి శుక్రవారం పాదయాత్ర ప్రారంభించారు. 34వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుకమ్మ, చంటి సతీమణి మీన, కుటుంబ సభ్యులు పద్మావతి ఇంటింటికి తిరిగి చంటిని గెలిపించాలని కోరారు. అనంతరం కొట్టు సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మధూ వెంకట్రావు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ప్రారంభించారు.

హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం



కైకరంలో హోం ఓటింగ్ వేస్తున్న సీనియర్ సిటిజన్

ఏలూరుసిటీ, మే 3: ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏలూరులో శుక్రవారం హోం ఓటింగ్ ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమా న్ని ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి ప్రారంభించి ఆ యా ప్రాంతాల్లో హోం ఓటింగ్ తీరును స్వయంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 85 ఏళ్ల పైబడిన వారు 70 మంది ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు 31 మంది కలిపి మొత్తం 101 మంది ఓటర్లు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి హోం ఓటింగ్ సదుపాయం కల్పించేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం శుక్రవారం, శనివారం కొనసాగుతుందని, సెక్టార్ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు.

పెదపాడు/చింతలపూడి/ఉంగుటూరు/ దెందులూరు, మే 3 : పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియను దెందులూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ లావణ్యవేణి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,763 మంది దరఖాస్తులు అందజేయగా వారిలో 95 మందిని గుర్తించామని, వీరిలో తొలిరోజు 87 మంది ఓటు హక్కు వినియోగిం చుకున్నారన్నారు. చింతలపూడి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్‌కోసం నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామని సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. 120 మంది హోమ్ ఓటింగ్‌కు నమోదు అయ్యారని తెలిపారు. ఉంగుటూరు మండలంలో మొత్తం 223 మందికి 113 మంది శుక్రవారం ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగు అధికారి ఎన్.ఎస్.కే.ఖాజావలీ తెలిపారు.

బీసీలను నమ్మించి మోసగించిన జగన్

- మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



ఆత్మీయ సదస్సులో ఐక్యత చాటుకున్న నాయకులు

ఏలూరు రూరల్, మే 3 : 'బీసీలను నమ్మించి మోసం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగే హక్కులేదు.. ఉమ్మడి మేనిఫెస్టోతో అధికార వైసీపీకి వణుకు పట్టుకుంది.. సీఎం జగన్ అరాచక పాలనకు మద్దతు ఇచ్చి ధర్మంవైపు ఉంటారో, చంద్రబాబు, పవన్ కూటమికి మద్దతు ఇచ్చి ధర్మంవైపు ఉంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానికంగా ఏలూరు నియోజకవర్గ గౌడ సమాఖ్య ఆధ్వర్యంలో గౌడ, శెట్టి బలిజ, శ్రీశైన, ఈడిగ, ఆత్మీయ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్ అరాచక రాజకీయ, అవినీతి రాజ్యాన్ని అణచివేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు కదలాలన్నారు. బీసీల కోసం 56 కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి గొప్పలు చెప్పుకుంటున్న జగన్‌కు కనీసం కార్పొరేషన్ ఛైర్మన్‌లకు కూర్చోవడానికి కుర్చీలు వేయలేదని మండిపడ్డారు. బీసీలను అన్నివిధాలా అణగదొక్కారని మండిపడ్డారు. రాష్ట్రంలో సారా, ఇసుకదందా కనివినీ ఎరుగని స్థాయిలో జరిగిందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మీదేనన్నారు. ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ వైసీపీ పాలనలో దౌర్జన్యం, దోపిడీ పెరిగాయని, సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పరిపాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరామ్, ఉప్పాల జగదీష్‌బాబు, పట్నాల శేషగిరిబాబు, మారగాని చంద్రకిరణ్, సాంబశివరావు, గౌడసంఘం నేతలు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు - కవాతులు



రాత్రివేళ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు



హైవేపై వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 3 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లజాము వరకు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. నాటుసారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. పలు నగరాలు, పట్టణాలు, పలు ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు. జిల్లాకు వచ్చిన పారామిలటరీ దళాలతో రాత్రివేళ గ్రామీణ ప్రాంతాల్లో కవాత్‌లు నిర్వహించారు. చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారు.

క్రైం వార్తలు

నీటి కుంటలో పడి వ్యవసాయ కూలీ మృతి

కొయ్యలగూడెం, మే 3: నీటి కుంటలోపడి వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన కొయ్యలగూడెం మండలం రాజవరం యర్రకాల్వలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పోతులూరి సత్యనారాయణ(45) వ్యవసాయ కూలి పని నిమిత్తం యర్రకాల్వ దగ్గరకి వెళ్లాడు. నీళ్ళ కోసం అక్కడ ఉన్న ఒక కుంటలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు కాలుజారి మునిగిపోయాడు. స్థానికులు రక్షించే లోపే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాలుడు అనుమానాస్పద మృతి



యశ్వంత్‌రెడ్డి (ఫైల్)

నూజివీడు టౌన్, మే 3: బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో జరిగింది. పట్టణంలోని శారదానగర్‌లో ఉంటున్న కొవ్వూరి సాయి యశ్వంత్‌రెడ్డి (16) తమ నివాస భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందా డు. శుక్రవారం ఉదయం ఇది గమనించిన బాలుడి తండ్రి రాముకెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తొలుత భావించినా, మృతుడి బెడ్‌రూమ్‌లో రక్తపు మరకలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడి తండ్రి నూజివీడు పట్టణంలో ఫర్నిచర్ షాపును నడుపుతున్నాడు. బాలుడు ఇటీవల పదో తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మే 3 : ఓ వ్యక్తి పురుగుల మందుతాగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన బన్నే వీరాస్వామి(50)కు భార్య రాజేశ్వరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం పొలం వెళ్ళిన అతడు మధ్యాహ్నం ఊరులోకి వచ్చి రోడ్డుపైన అకస్మాత్తుగా పడిపోయాడు. అతడి నోటి వెంబడి నురగలు రావడంతో వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి ప్రత్యేక విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనుమానాస్పద స్థితిగా వైద్యులు భావించి ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఏలూరు క్రైం, మే 3 : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లినే కొట్టి హతమార్చిన కుమారుడిని ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. ఏలూరు పడమరవీధి దొంగలమరం ప్రాంతానికి చెందిన డొక్కు కృష్ణవేణి(55)కు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికి వివాహాలయ్యాయి. భర్త కొంతకాలం క్రితం మరణించగా కుమారుడికి వివాహం కాలేదు. ఆమె వద్దే ఉంటున్నాడు. ఆమెకు విడో పెన్షన్ వస్తుంది. ఈనెల ఒకటో తేదీన ఆమె పెన్షన్ రావడంతో ఆమె కుమారుడైన హరికృష్ణ మద్యం తాగడానికి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఆమె తలను గోడకు గొట్టి హతమార్చాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. హంతకుడైన హరికృష్ణను శుక్రవారం ఉదయం వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ అరెస్టు చేశారు.

కమనీయం .. శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసునికి, అమ్మవార్లకు కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, మే 3 : పురాతన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన ఆలయంలో మేళతాళాలు, మంగళవాయి ద్యాలు. అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ కల్యాణతంతు భక్తులకు నేత్రపర్వమైంది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకి వాహనంలో ఉంచి కల్యాణవేదిక వద్దకు తీసుకెళ్లారు. అంతకు ముందే అలంకరించిన వేదికపై కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు కల్యాణతం తును ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలు భక్తుల గోవిందనామ స్మరణ నడుమ వైభవంగా జరిగింది.



టెన్త్ టాపర్లతో యూటీఎఫ్ జిల్లా నాయకులు

ప్రభుత్వ 'పది' టాపర్లకు యూటీఎఫ్ సత్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, మే 3:పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ/ జడ్పీ హైస్కూళ్ళనుంచి అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన బాలబాలికలను శుక్రవారం ఏలూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సత్కరించారు. శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి మురాల మహేష్‌బాబు, ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ హైస్కూలు విద్యార్థిని శానం నందినిప్రియ, చాట్రాయి మండలం చిన్నంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి జబ్బూరి యశ్వంత్‌లతోపాటు, పోలిరెడ్డి జ్యోషికప్రియ, లుక్కా ధనుష, జొన్నకూటి శ్రీరామ్‌లను దుశ్శాలువాలతో సన్మానించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంనుంచి జడ్పీ హైస్కూల్ టాపర్లకు ఎటువంటి ప్రోత్సాహకాలు లేకపోయినా యూటీఎఫ్ పక్షాన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘ నాయకులు సుభాషిణి, కిషోర్‌కుమార్, సాగర్‌బాబు, సుదారాణి, బేతాళరావు, స్వర్ణరేఖ, అప్పారావు, మోహనరావు, రాంబాబు పాల్గొన్నారు.

'జగన్ గద్దె దిగే సమయం ఆసన్నమైంది'

కామవరపుకోట, మే 3 : సీఎం జగన్ పీఠం నుంచి దిగిపోయే సమయం దగ్గర పడిందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొత్తూరులోని మండల తెలుగుదేశం కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, ఎం. నాగేశ్వరరాంబాబుతో కలిస మాట్లాడారు. తొలుత కిలారు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సలహాలు పాటించాలని కిలారుకు సూచించారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 3 : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటీపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాల విద్యార్థులు నలుగురు ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గిరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నియామక పత్రాలను సంస్థ సీఈవో హరిబాబు అందజేశారు. అధ్యాపకులు వెంకట్రావు, పద్మావతి, విజయకుమార్, కృష్ణచైతన్య, పరమేశ, కావ్య పాల్గొన్నారు.


కార్మికుల పోరాటాలు మరువలేనివి



దొరమామిడి మేడే వారోత్సవాల్లో న్యూడెమోక్రసీ నాయకులు

బుట్టాయగూడెం, మే 3 : చికాగోలో కార్మికులు పోరాటం చేసి ఎనిమిది గంటల పనిదినాలను సాధించిన తర్వాతనే శ్రామికుడు మనిషిగా సంపూర్ణ స్థానానికి ఎదిగాడని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ధర్ముల సురేష్ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం దొరమామిడిలో జరిగిన మేడే వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఇఫ్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.నాగేశ్వరావు జెండాను ఎగురవేశారు. దేశంలో ఎనిమిది గంటల పనిదినాలను రద్దుచేసి పన్నెండు గంటలు చేస్తూ బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో చట్టరూపంగా ఆమోదం పొందడం దుర్మార్గమన్నారు. నాయకులు కేవీ రమణ, పి.రాజేష్, కోమరం మారమ్మ, బి.ఆకాష్, గురుగుంట్ల పద్మ, కె.నాగరాజు పాల్గొన్నారు.

జనం.. జోష్..







జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కైకలూరు పర్యటన శుక్రవారం జన సందోహం నడుమ ఉత్సాహంగా సాగింది. మండుటెండలో పవన్ పర్యటన ఆలస్యమైనా జనం ఎదురుచూశారు. ఆలస్యాన్ని అభిమానులు ఉత్సాహంగా మార్చేశారు. బైక్‌లు, ట్రాక్టర్ల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కైకలూరు తాలుకా సెంటర్లో చెట్ల నీడ, చెట్లపైకి ఎక్కి పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు నిరీక్షించారు. పవన్‌కల్యాణ్ రాకతో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


వచ్చిండే..: పవన్‌కోసం ఎదురుచూపులు


స్టార్ట్ కెమెరా : పవన్‌ను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న అభిమానులు


జెండా పండుగ : ఐక్యంగా జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు


వెయ్.. చిందెయ్: పవన్ పర్యటనలో అభిమానుల సందడి

అభిమాన పునాది : యువకుడి ఉత్సాహం

ఎండను సైతం లెక్కచేయని అభిమానులు
పవన్ సభకు భారీగా తరలివచ్చిన శ్రేణులు

కైకలూరు, మే 3: కైకలూరులో పవన్ కల్యాణ్ బహిరంగ సభకు అభిమానులు, కూటమి కార్యకర్తలు మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. కైకలూరులో ఎటూ చూసినా రహదారులు కిక్కిరిసిపోయాయి. హెలికాప్టర్ ల్యాండ్ కాగానే అభిమానులు కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పవన్‌కల్యాణ్ అభిమానుల కేరింతల మధ్య సభాప్రాంగణానికి చేరుకున్నారు. దారి పొడవునా అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన అభివాదం చేశారు. పవన్‌కల్యాణ్ బహిరంగసభ రెండు గంటలు ఆలస్యమైనా ఎండవేడిమిని తట్టుకుని నియోజకవర్గంలోని నలు మూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఎక్కడి కక్కడ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేశారు. ఎండను తట్టుకోలేక ప్రజలు కైకలూరు తాలుకా సెంటర్లోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని చెట్ల నీడను, చెట్లపైకి ఎక్కి పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు నిరీక్షించారు. పవన్ రాకతో సభ కేకలతో దద్దరిల్లింది. అభిమానులు, ట్రాక్టర్లు, బైక్‌లు, ఆటోలతో విన్యాసాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. చిన్నపిల్లలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఎక్కడ చూసినా టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు ఊపుతూ పాటలకు డ్యాన్సులు చేశారు.

కలిదిండి: కైకలూరులో శుక్రవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహించిన వారాహి విజయభేరి బహిరంగ సభకు కలిదిండి నుంచి సుమారు 1800 బైకులపై ర్యాలీగా కైకలూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన అంతం చేయటానికి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కైకలూరులో శుక్రవారం జరిగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభకు ముదినేపల్లి మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల జనసేన కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు ఏఎన్ బాబు, వేల్పూరి నానాజీ, బాసినశెట్టి కిషోర్, మదన్ మోహన్ తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు, వివిధ గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు పవన్ కళ్యాణ్ సభకు వెళ్లారు.


కలిదిండి ఎస్‌బీఐ వద్ద వృద్ధులు పడిగాపులు

పెన్షనర్ల పాట్లు..
ఎండలో బ్యాంకుల వద్ద పడిగాపులు

ముదినేపల్లి, మే 3 : సామాజిక భద్రతా పించన్ల సొమ్మును లబ్ధిదార్ల బ్యాంకు ఖాతాలకు జమ చేయటంతో ముదినేపల్లి మండలంలోని అన్ని బ్యాంకుల వద్ద వృద్ధులు బారులు తీరారు. బ్యాంకులకు సుమారు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి ఆటోల్లో, తెలిసిన వారి బైక్‌లపై బ్యాంకులకు చేరుకుంటున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చున్న వృద్ధులు కౌంటర్ వద్దకు వెళ్లాక ఖాతా రన్నింగ్‌లో లేదని ఆధార్ కార్డు తీసుకొచ్చి లింకు చేసుకోవాలని బ్యాంక్ సిబ్బంది చెబుతుండటంతో చాలా మంది మండుటెండలో తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా ముదినేపల్లి ఎస్‌బిఐ ఖాతాదార్ల సేవా కేంద్రం వద్ద పింఛన్‌దార్లకు నీడ కల్పించేందుకు అధికారులు షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ బ్యాంక్ సేవా కేంద్రం వద్ద గురువారం మండుటెండలో వృద్ధులు పింఛన్ కోసం ఇబ్బందులు పడిన విషయమై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు స్పందించిన ముదినేపల్లి ఎంపీడీవో ఎన్.మురళీ గంగాధర రావు వెంటనే స్పందించి స్థానిక ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద షామియానా ఏర్పాటు చేయించారు.


పెన్షన్ రాక వెనుదిరిగిన అవ్వ

కలిదిండి: ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలిదిండి ఎస్‌బీఐ వద్ద పెన్షనర్లు పడిగాపులు కాశారు. ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని సంబంధిత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తుండడం కనిపించింది.

ఆగిరిపల్లి: పెన్షన్‌దారులతో శుక్రవారం బ్యాంకులు కిటకిటలాడాయి. కొన్ని ఖాతాలకు ఆధార్ లింక్ అవ్వలేదనే సాకుతో వెనక్కి పంపడంతో వృద్ధులు ఎండలో నరకయాతన అనుభవించారు. ఏదైనా సచివాలయంలో వేలిముద్ర వేస్తే పెన్షన్ వెంటనే ఇచ్చేవారని, బ్యాంకులో ఇబ్బంది పెడుతున్నారని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కైకలూరు ఎమ్మెల్యేకు అస్వస్థత

కైకలూరు, మే 3: కైకలూరు ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు అస్వస్థత గురువారం రాత్రి అస్వస్థతకు గురవడంతో 108లో ఆయన కుటుంబీకులు విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎన్నికల ప్రచారాల్లో తిరగడం వల్ల వడదెబ్బ తగిలినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శుక్రవారం విజయవాడలోని ఎమ్మెల్యేని పరామర్శించారు. స్వల్ప అస్వస్థతకు గురయ్యారని రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుని ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటారని జయమంగళ వెల్లడించారు.

సాయుధ బలగాల కవాతు



కలిదిండి, మే 3 : ఎన్నికలు సమీ పిస్తుండటంతో కలిదిండి మండ లంలోని కోరుకొల్లు, సానా రుద్రవరం గ్రా మాల్లో శుక్రవా రం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రియకుమార్ మాట్లాడుతూ సమస్యా త్మక గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఓటర్లు తమ ఓటు హక్కును యథేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.

క్రైం వార్తలు

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి


సాయి యశ్వంత్‌రెడ్డి (ఫైల్)

నూజివీడు టౌన్, మే 3: బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో చోటు చేసుకుంది. పట్టణంలోని శారదానగర్‌లో ఉంటున్న కొప్పూరి సాయి యశ్వంత్‌రెడ్డి (16) తమ నివాస భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇది గమనించిన బాలుడి తండ్రి రాము రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తొలుత భావించినా, మృతుడి బెడ్‌రూమ్‌లో రక్తపు మరకలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా మృతుడి తండ్రి నూజివీడు పట్టణంలో ఫర్నిచర్ షాపును నడుపుతున్నాడు. బాలుడు ఇటీవల పదో తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

అనధికార మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, మే 3: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 36 బాటిళ్ళ అనధికారిక మద్యం, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు ఎస్ఈబీ అధికారులు, నూజివీడు మండలం మీర్జాపురంలో తనిఖీలు చేస్తుండగా మల్లవల్లి రహదారిపై అనధికారిక మద్యం బాటిళ్ళను తరలిస్తున్న బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన బొల్లిగర్ల కోటేశ్వరరావును గుర్తించి అతని నుంచి 36 బాటిళ్ళ మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.




కాకరవాడ ప్రచారంలో మాట్లాడుతున్న కామినేని.. చావలిపాడు సర్పంచ్ ధనలక్ష్మి దంపతులను కూటమిలోకి ఆహ్వానిస్తున్న కామినేని

అభివృద్ధికే అంకితమవుతా : కామినేని

ముదినేపల్లి, మే 3 : కైకలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని నియోజకవర్గ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలం కాకరవాడ పంచాయతీ ఏరియాలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావటం ఖాయమని, నియోజకవర్గంలో డ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థల అభివృద్ధితోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు సాధిస్తానని, తనను గెలిపించాలని కోరారు. గ్రామంలో కామినేనికి ఘన స్వాగతం లభించింది. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహన్‌రావు, పరసా విశ్వేశ్వరరావు, లింగమనేని భాను ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చావలిపాడు వైసీపీ సర్పంచ్ టీడీపీలో చేరిక

మండవల్లి: మండవల్లి మండలంలో వైసీపీకి శుక్రవారం మరో ఎదురుదెబ్బ తగిలింది. మండలంలో యాదవ సామాజిక వర్గం నుంచి వైసీపీలో కీలక నేతగా చక్రం తిప్పుతున్న చావలిపాడు వైసీపీ సర్పంచ్ తలారి ధనలక్ష్మి అన్నిబాబు ఎన్డీయే తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో తన అనుచరులు వంద మందితో తెలుగుదేశం పార్టీలో చేరారు. లోకుమూడిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కామినేని శ్రీనివాస్ చావలిపాడు సర్పంచ్ తలారి ధనలక్ష్మి, ఆమె భర్త అన్నిబాబు, అతని అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చావలిపాడు వైసీపీ సర్పంచ్ ధనలక్ష్మి టీడీపీలో చేరడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

కైకలూరు, మే 3: సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి కే భాస్కర్ తెలిపారు. పాత తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ ప్రక్రియకు కైకలూరు మండలంలో ఫాం 12/12డి సమర్పించిన ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు పాల్గొనాలని కోరారు. ఈ ప్రక్రియ రెండు రోజుల పాటు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని ఆర్వో తెలిపారు.

నేడు కలిదిండి మండలంలో కామినేని ప్రచారం

కలిదిండి, మే 3 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ శనివారం కలిదిండి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. గోపాలపురం, వెంకటాపురం, గుర్వాయిపాలెం, లోడిదలంక, కలిదిండిలో ప్రచారం నిర్వహిస్తారని, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు నూజివీడులో చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి

నూజివీడు, మే 3: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం నూజివీడు పట్టణంలో రోడ్ షో నిర్వహిస్తున్నారని, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నూజివీడు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపరిపాలనను అంతమొందించటానికి టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. సాయంత్రం 4 గంటలకు ఆయన హెలికాప్టర్ ద్వారా నూజివీడు వచ్చి పట్టణంలో రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. కూటమి శ్రేణులు, నూజివీడు పరిసర నియోజకవర్గాల టీడీపీ అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముసునూరు: నూజివీడులో శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే టీడీపీ ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం పిలుపునిచ్చారు. పార్టీ అధినేత సభకు వస్తున్న నేపథ్యంలో మండలంలోని 16 గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చెయ్యాలి

చాట్రాయి, మే 3: వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయటంతో పాటు, పట్టాదారు పాస్ పుస్తకాలపై ఉన్న జగన్ చిత్రాన్ని తొలగించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిత్రార్జితంగా సంక్రమించిన, కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొనుక్కున్న భూములకు యాజమాన్య హక్కులను ధ్రువీకరించే పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ ముద్రించటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం

నూజివీడు టౌన్, మే 3: నూజివీడు నియోజకవర్గ పరిధిలో వయో వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి హోమ్ ఓటింగ్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు నియోజక వర్గంలో మొత్తం 109 మంది ఓటర్లను గుర్తించగా, హోమ్ ఓటింగ్ నమోదు అనంతరం ఐదుగురు మృతి చెందటంతో 104 మంది ఓట్లను పోస్టల్ బ్యాలెట్ విధానంలో అధికారులు స్వీకరిస్తున్నారు. కాగా చాట్రాయి మండలంలో 29, ముసునూరు మండలంలో 13, ఆగిరిపల్లి మండలంలో 11, నూజివీడు మున్సిపల్ పరిధిలో 35, నూజివీడు మండల పరిధిలో 16 మంది హోమ్ ఓటర్లు ఉండగా, వారి ఓట్ల సేకరణ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. మొదటిరోజు దాదాపు 50 శాతం ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కొల్లేరు కిలకిల..

కైకలూరు నియోజకవర్గం రాజకీయంగా చైతన్యవంతమైనది. ఇప్పటివరకు మూడుసార్లు స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. రెండుసార్లు మంత్రి పదవులు వరించాయి. పార్టీలకన్నా వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తారు ఇక్కడి ఓటర్లు. ఈ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లోని పలు గ్రామాలు బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాలతో ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి మండలం, మండవల్లి మండలం పూర్తిగా కైకలూరు నియోజకవర్గంలోకి చేరాయి. ప్రస్తుతం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంగా కైకలూరు ఉన్నప్పటికీ నేటికి గ్రామ పంచాయతీగానే ఉంది. - కైకలూరు



ఫ్లాష్ బ్యాక్



నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కైకలూరు నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా పేరొందింది. 2009లో పునర్విభజనతో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. 72 సంవత్సరాల్లో 16 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో అత్యధికంగా ఓసీ సామాజికవర్గానికి చెందినవారే గెలుపొందారు. జయమంగళ వెంకటరమణ ఒక్కరు మినహా మిగిలిన వారంతా ఓసీ అభ్యర్థులే. అప్పటికి అత్యధికంగా కనుమూరి బాపిరాజు నాలుగుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఎర్నేని రాజరామచందర్ మూడుసార్లు గెలుపొందారు. కమ్మిలి అప్పారావు రెండుసార్లు, చెన్నంశెట్టి పాండురంగారావు, కమ్మిలి మంగ తాయారమ్మ ఒకసారి, నంబూరి వెంకటరామరాజు ఒకసారి గెలుపొందారు. ముదినేపల్లి మండలం కైకలూరు నియోజకవర్గంలో విలీనం చేయడంతో ఆ మండలంలో ఉన్న బీసీలు, ఓసీ వర్గాలకు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు చూపడంతో పార్టీకి మరింత పట్టు పెరిగింది. దీంతో 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ గెలుపొందగా, 2014లో కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలిచారు. టీడీపీ అధికారం చేజిక్కించుకోవడంతో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో హోరాహోరీగా పోటీపడిన జయమంగళ వెంకటరమణ ఓటమి పాలవ్వడంతో వైసీపీ నుంచి దూలం నాగేశ్వరరావు 9357 ఓట్ల తేడాతో గెలుపొందారు.





- ఆహ్లాదాన్ని అందించే కొల్లేరు పర్యాటకం
- ఆధ్యాత్మికతను చాటే ఆలయాలు
- ఆక్వా ఉత్పత్తులకు ప్రసిద్ధి
- నాలుగు దశాబ్దాలుగా ఎగుమతులు
- రాజకీయంగా చైతన్యవంతం

నియోజకవర్గం : కైకలూరు
మొత్తం ఓటర్లు : 2,05,604
పురుషులు : 1,01,196
మహిళలు : 1,04,404
ఇతరులు : 4
పోలింగ్ బూత్‌లు : 235

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	దూలం నాగేశ్వరరావు	వైసీపీ	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	9,357
2014	కామినేని శ్రీనివాస్	బీజేపీ	ఉప్పాల రాంప్రసాద్	వైసీపీ	21,571
2009	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	కామినేని శ్రీనివాస్	ప్రజారాజ్యం	974
2004	ఎర్నేని రాజరామచందర్	కాంగ్రెస్‌ఐ	కమ్మిలి విఠలరావు	టీడీపీ	2,056
1999	ఎర్నేని రాజరామచందర్	ఇండిపెండెంట్	గట్టుమనేని విజయనిర్మల	టీడీపీ	1,109
1994	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	5,530
1993	ఎర్నేని రాజరామచందర్(ఉప)	టీడీపీ	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్	6,562
1989	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	10,535
1985	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	పి.ఆదినారాయణమూర్తి	టీడీపీ	5,283
1983	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	కేవీ రావు	టీడీపీ	803
1978	కనుమూరి బాపిరాజు	ఇండిపెండెంట్	ఎస్.నాగేశ్వరరావు	కాంగ్రెస్‌ఐ	46
1972	కె.మంగతాయారమ్మ	కాంగ్రెస్	జరిమయ్య	ఇండిపెండెంట్	37,312
1967	చెన్నంశెట్టి పాండురంగారావు	ఇండిపెండెంట్	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	1,694
1962	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,351
1955	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,616
1952	ఏపీ సుబ్రహ్మణ్యం	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	110

ఆక్వా ఎగుమతులకు ప్రసిద్ధి

నాలుగు దశాబ్దాలుగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ప్రసిద్ధి గాంచిన ప్రదేశంగా కైకలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కైకలూరుకు ఆనుకొని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు ఉండడం ఇక్కడ కొల్లేరు చేపలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. కొల్లేరు చేప పేరు వినగానే మాంస ప్రియులకు నోరూరుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటిగా చేపల పరిశ్రమకు పునాది వేసింది కైకలూరే. పరిశ్రమ రోజురోజుకి అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని తలసరి ఆదాయంలోని మొదటి స్థానంలో కలిదిండి, రెండో స్థానంలో కైకలూరు నిలిచింది.

ఆధ్యాత్మిక శోభ

కైకలూరు గ్రామ నడిబొడ్డున శ్యామలాంబ అమ్మవారు ఆలయం ఉంది. ఇందులో ఒకేచోట మూడు శివాలయాలు ఉండడం ప్రత్యేకత. దీని సమీపానే మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ స్వామివారికి మీసాలు ఉండడం విశేషం. కొల్లేరు సరస్సు నడిబొడ్డున కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు నిత్యం భక్తుల నీరాజనాలు అందుకుంటూ ఉంటారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి, ముదినేపల్లి మండలంలో సింగరాయపాలెంలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి.

ఆహ్లాదం.. కొల్లేరు పర్యాటకం

కైకలూరు సమీపాన ఆటపాక పక్షుల కేంద్రం ఉంది. ఇక్కడ వివిధ దేశాల నుంచి వలస పక్షులు ప్రతీ సంవత్సరం కొల్లేరులో సేద తీరుతూంటాయి.ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది పర్యాటకులు కొల్లేరు సరస్సును సందర్శించి పక్షుల విన్యాసాలను తిలకిస్తూంటారు. ఈ వాతావరణం ఎంతో ఆకట్టుకుంటుంది.

